

ఇఫ్తార్ విందులో ఎంపీ అభ్యర్థి
ఖానాపూర్: ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి నక్కు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ సోమ: 6:33
సహర్ మంగళ: 4:41

గరిష్టం/కనిష్టం 38.0 /24.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా, కొన్నిచోట్ల పూర్తిగా మేఘావృత మవుతుంది. జిల్లాలో పలుచోట్ల సాయంత్రం చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కల్లెడలో మల్లన్న బోనాలు



వేడుకల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి సుగుణ

కడెం: మండలంలోని కల్లెడ గ్రామంలో ఆదివారం మల్లన్న బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. మట్టి కుండల్లో వండిన బోనాన్ని మోదుగ ఆకుల్లో మల్లన్నకు నైవేద్యంగా సమర్పించారు. వేడుకల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ పాల్గొని పూజలు చేశారు. వీరి వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ తదితరులున్నారు.

హరిశ్రీకి పురస్కారం



పురస్కారంతో హరిశ్రీ

నర్సాపూర్ (జి): మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన భారత దేశ గౌరవ పురస్కారాలు–2024 కార్యక్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన కూచిపూడి డ్యాన్స్ మాస్టర్ నవ్య వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన ఆడెపు మహేందర్–నవనీత దంపతుల కుమార్తె హరిశ్రీకి భారతదేశ గౌరవ పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిశ్రీని పలువురు అభినందించారు.

ఫైర్‌లైన్స్ పనులు



ఫైర్‌లైన్స్ పనులు చేస్తున్న కూలీలు

కడెం: మండలంలోని పెద్దూర్ సమీపంలో కూలీలు ఆదివారం ఫైర్‌లైన్స్ పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఎండిన ఆకులను కాలబెట్టారు. వేసవిలో అడవుల్లో మంటలు వ్యాపించి చెట్లు కాలిపోవడంతో పాటు వన్య ప్రాణులకు ముప్పు పొంచి ఉండగా అధికారులు ముందస్తుగా ఈ పనులు చేపడుతున్నారు.

కొనసాగుతున్న కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు



మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

కడెం: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కడెం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయడంతో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ప్రాజెక్ట్ వరద గేట్ల రోలర్స్, బేరింగ్స్, కౌంటర్ వెయిట్, రోప్ పనులు చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాగా, వానాకాలానికి ముందే మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నంది అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే సన్మానం



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: 'ప్రేమతో నాన్న' అనే లఘు చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా వేణుగోపాలకృష్ణ, ఉత్తమ నటిగా సుహాసి ఇటీవల హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో నంది పురస్కారాలు దక్కాయి. ఆదివారం వీరు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డిని నిర్మల్‌లో కలువగా సన్మానించి అభినందించారు.

ఎస్పీ కార్యాలయంలో ఇఫ్తార్

నిర్మల్‌టౌన్: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ముస్లిం పోలీసులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల పోలీస్ కుటుంబాలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీ కాంతిలాల్, ఏవో యోనాస్ అలీ, సీఐలు, ఆర్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

ఎండలు భగభగ



మధ్యాహ్నం నిర్మానుష్యమైన నిర్మల్ బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు

- జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు
- మున్ముందు మరింత పెరిగే అవకాశం
- ఇప్పటికే వడదెబ్బతో ఇద్దరు మృతి
- జాగ్రత్తలు పాటించాలన్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. కొద్దిరోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడి ప్రతాపానికి జనం విలవిల్లాడుతున్నారు. అప్పుడే వడదెబ్బ మరణాలు కూడా సంభవిస్తున్నాయి. గురువారం జిల్లాకేంద్రంలోని జీఎన్‌ఆర్ కాలనీకి చెందిన గృహిణి స్వర్ణలత వడదెబ్బతో మృతి చెందింది. ఆదివారం భైంసాకు చెందిన పోశెట్టి వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఏప్రిల్‌లోనే ఈ పరిస్థితి ఉంటే మున్ముందు మరెలా ఉంటుందోనని జనం బెంబేలెత్తుతున్నారు. వారం రోజులుగా జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం వేళ 43 డిగ్రీలు దాటుతోంది. మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జనాలు జంకుతున్నారు.

ప్రారంభం నుంచే తీవ్రత..

జిల్లాలో ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు దంచి కొడుతున్నాయి. మార్చి మధ్యలో మొదలైన ఎండలు ఈనెల మరింత పెరిగాయి. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదవుతుండగా ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉదయం 8నుంచే ఎండ మొదలై 11గంటలకల్లా తీవ్రస్థాయికి చేరుతోంది. వచ్చేనెలలో వేడి తీవ్రత మరింత ఉంటుందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. జిల్లా అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎండకు వడగాలులు తోడయ్యాయి. మధ్యాహ్నం వేళ ఉక్కపోత భరించలేనంతగా ఉంటోంది. ఏప్రిల్ మొదటి వారంలోనే 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా వచ్చే నెలలో సగటున 45–46 డిగ్రీల వరకు వెళ్లొచ్చని వాతావరణశాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అవసరమైతేనే బయటకు..

అవసరమైతేనే మధ్యాహ్నం బయటకు వెళ్లాలని వైద్యులు చెబుతున్నారు. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వైద్యుల సూచనలు

- ప్రతీరోజు ఐదు లీటర్ల నీరు తాగాలి.
- బిగుతుగా ఉండేవి కాకుండా, లూజుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- రసాయనాలతో తయారుచేసే కూల్‌డ్రింక్స్ వద్దు. ఐస్ లేని పండ్ల రసాలు తాగాలి.
- కొబ్బరినీళ్లు తాగడం మంచిది. ఎండలో వెళ్లొచ్చాక నీరసం అనిపిస్తే గోరు వెచ్చని నీటిలో ఓఆర్‌ఎస్ పౌడర్ కలిపి తాగాలి.
- బయటకు వెళ్లేటప్పుడు టోపీలు పెట్టుకోవాలి. గొడుగు తీసుకువెళ్లడం ఉత్తమం.

జ్వరాల బారిన ప్రజలు

సాధారణంగా మానవ శరీరం 30నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతను మాత్రమే తట్టుకుంటుంది. అయితే ప్రస్తుతం 42డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణంలో సంభవించిన మార్పులు, ఉష్ణోగ్రత పెరుగుదల కారణంగా ప్రజలు ఎక్కువగా హీట్ పైరెక్సియా జ్వరం బారిన పడుతున్నారు. ఈ జ్వరం బారిన పడిన వారికి కళ్లు మండటం, తలనొప్పి రావడం, మూత్రంలో మంట, శరీరం వేడెక్కడం లాంటి లక్షణాలుంటాయి. డయేరియా, వడదెబ్బకు గురవుతుంటారు. జిల్లాలో హీట్ పైరెక్సియా, డయేరియా, జ్వరం, వడదెబ్బకు గురవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు బాధితులతో నిండిపోతున్నాయి.

పిల్లల విషయంలో జాగ్రత్త



వేసవిలో పిల్లలు త్వరగా వడదెబ్బ బారిన పడుతుంటారు. వారిని ఎండలో ఆడనివ్వొద్దు. బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా నీళ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలి. తరచూ నీటిని తాగించాలి. రేకుల షెడ్లలో ఉండేవారు పిల్లలకు వేడి తగలకుండా చూసుకోవాలి. ఉదయం, సాయంత్రం పిల్లలను బయటకు తీసుకెళ్లాలి.

– స్వప్న, చిన్నపిల్లల డాక్టర్

ముందుజాగ్రత్తలతోనే..



వేసవి ముగిసేదాకా జాగ్రత్తలు పాటించాలి. బయటికి వెళ్లాల్సిన పని ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లో పూర్తిచేసుకోవాలి. వడదెబ్బ, డయేరియా బారిన పడకుండా ఉండాలంటే ముందుజాగ్రత్తే పెద్ద మందు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకువెళ్లాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

– ధనరాజ్, డీఎంహెచ్‌వో

తాయిలాల ఎర

- కార్యకర్తలను ఆకర్షించేలా కాంగ్రెస్ మంత్రం
- 'స్థానిక' ఎన్నికల్లో అవకాశమంటున్న నేతలు
- నేడు ఆదిలాబాద్, నిర్మల్‌లో బూత్‌స్థాయి ఏజెంట్ల శిక్షణ
- మంత్రి సీతక్క, కొప్పుల రాజు రాక



సాక్షి, ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో పటిష్టతపై దృష్టి సారించింది. బూత్ లెవల్‌లో కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందని ఆశిస్తోంది. ఈ మేరకు కార్యకర్తలను ఆకర్షించేందుకు తాయిలాల ఎరపై ఫోకస్ పెంచింది. మంచి ఫలితాలు సాధించిన వారికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని చెబుతోంది. ఆసిఫాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఆదిలాబాద్, నిర్మల్‌లో సోమవారం బూత్‌స్థాయి ఏజెంట్ల సమావేశం నిర్వహించనుంది. ఇందులో ఆయా జిల్లాల్లోని నియోజకవర్గాల కార్యకర్తలు పాల్గొననున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు హాజరవుతారు.

పటిష్టతపై దృష్టి..

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందాలంటే బూత్ స్థాయిలో ఏజెంట్ల తోడ్పాటు కీలకమని హస్తం పార్టీ భావిస్తోంది. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా, చురుగ్గా పనిచేసేందుకు పదవి ఆశ చూపుతోంది. ఈ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయి. ఈ నేపథ్యంలో బూత్ స్థాయిలో కష్టపడే కార్యకర్తలకు మంచి అవకాశం ఉంటుందని ఈ సమావేశాల ద్వారా స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు.. ఇలా ఆయా స్థాయిల్లో అవకాశం కల్పిస్తామని ముఖ్య నేతలు చెబుతున్నారు.

భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ..

నియోజకవర్గ స్థాయిలో ముఖ్యనేతల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలని కార్యకర్తలకు సూచిస్తున్నారు. ప్రధానంగా రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయడమనేది పార్టీలో ప్రతీఒక్కరి లక్ష్యంగా భావించి ముందుకు రావాలన్నట్లుగా పిలుపునిస్తున్నారు. అంతేకాకుండా ఆరు గ్యారంటీలతో సామాన్య ప్రజలకు చేకూరుతున్న ప్రయోజనాలు, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలు పేదలకు దోహదపడేలా ఉన్నాయని క్షేత్రస్థాయిలో వివరించాలని కార్యకర్తలకు ఈ సమావేశాల ద్వారా నేతలు స్పష్టం చేస్తున్నారు. మొత్తంగా తాయిలాల ఎర ద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడం, స్థానిక సంస్థల ఎన్నికలకు బూత్ స్థాయిలో పార్టీ పటిష్టత సాధించేలా కాంగ్రెస్ వ్యూహం రచించిందన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

నూతన నియామకం



మతిన్

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నిర్మల్ అసెంబ్లీ పరిశీలకుడిగా జిల్లా కేంద్రానికి చెందిన ఎంఏ మతిన్‌ను నియమిస్తూ ఆదివారం ఏఐసీసీ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్, తెలంగాణ ఇన్‌చార్జి ఫర్హాన్ అజ్మీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మతిన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ విజయం కోసం నిర్మల్ నియోజకవర్గంలో బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుకువెళ్తామని చెప్పారు. పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు.

క్షేత్రపర్యటనలో 150 మంది రైతులు

- ప్రత్యేక వాహనాల్లో వన్నెల్(కే) గ్రామానికి..
- అక్కడి సాగు విధానాలపై అవగాహన
- చొరవచూపిన ఎమ్మెల్యే రామారావుపటేల్



వన్నెల(కే) ఎత్తిపోతల పథకం వద్ద ఎమ్మెల్యే, రైతులు

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గ రైతులు సాగు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం వన్నెల్(కే) గ్రామ రైతులు అక్కడి ఎత్తిపోతల పథకాలను సద్వినియోగం చేసుకుంటూ అధిక దిగుబడులు సాధిస్తున్న తీరుపై ఇక్కడి రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. నియోజకవర్గంలోని బ్రహ్మన్‌గావ్, అష్ట, గన్నోరా, కనకాపూర్, అబ్దుల్లాపూర్, వడ్తల్, జోర్‌పూర్, గోడిసెర, చింతకుంట, లోకేశ్వరం, పిప్రి, ధర్మోరాకు చెందిన దాదాపు 150 మంది రైతులతో ఆదివారం ప్రత్యేక వాహనాల్లో వన్నెల్(కే) గ్రామానికి వెళ్లారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సహకారంతో అక్కడి ఎత్తిపోతల పథకాన్ని రైతులతో కలిసి సందర్శించారు. అక్కడి రైతులు సాగు చేస్తున్న పంటలు, సాగు విధానాలు పరిశీలించారు. అనంతరం అక్కడి రైతులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. వన్నెల్(కే) గ్రామ రైతులు ఎత్తిపోతల పథకాలను వినియోగించుకుంటూ ఏటా రెండు పంటలు తీస్తున్నారని తెలిపారు. ముధోల్ నియోజకవర్గంలో గోదావరినది పరీవాహక ప్రాంత గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తెచ్చి రైతులకు మేలు చేసే దిశగా తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు సంఘటితంగా నిర్ణయాలు తీసుకుంటే వ్యవసాయరంగంలో పురోగతి సాధించవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు రమేశ్, వెంగల్‌రావు, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ రాజారెడ్డి, రైతులున్నారు.

శుద్ధజలం.. సర్కారు ధ్యేయం

- ఇంటింటా సురక్షిత తాగునీరు సరఫరా
- పంచాయతీలకు నీటి పరీక్ష కిట్ల పంపిణీ
- కలుషిత నీటిని నివారించడమే లక్ష్యం
- పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో కలుషిత నీటిని పూర్తిగా నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామపంచాయతీలకు నీటి పరీక్ష కిట్లు పంపిణీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ధ్వంసమైన డ్రైనేజీలు, పైపులైన్ల లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమవుతోంది. ఈ కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో ముందుస్తుగా తాగునీటి కుళాయిల ద్వారా వచ్చే నీటిని పరీక్షించాలని సర్కారు భావించింది. ఇటీవల జిల్లాలోని పలు మండల్లాలో కలుషిత నీరు సరఫరా అవుతున్న విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అరకొరగా సరఫరా చేస్తున్న నీరు కూడా నాణ్యతగా లేకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని గుర్తించిన తాగునీటిశాఖ కలుషిత నీటికి చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. కుళాయిల ద్వారా వచ్చే నీటిలో క్లోరింగ్ శాతం తెలుసుకునేందుకు అధికారులు అన్ని పంచాయతీలకు నీటి పరీక్ష కిట్లు అందజేశారు. వీటిని శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా సక్రమంగా నీటి పరీక్షలు చేయించి శుద్ధజలం అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శుద్ధనీటి సరఫరాయే లక్ష్యంగా..

జిల్లాలో 396 గ్రామపంచాయతీలున్నాయి. ప్రతీ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం ఇటీవల చర్యలు చేపట్టింది. నీటి ఎద్దడి ఉన్నచోట కొత్త బోర్లు వేయిస్తోంది. పాడైన చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తోంది. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించింది. కలుషిత నీటి నివారణకు చర్యలు చేపట్టి శుద్ధజలం అందించాలని భావిస్తోంది. ఇందుకోసమే ప్రతీ ఏడాది పంచాయతీలకు నీటి పరీక్ష కిట్లు అందజేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. కానీ.. వాటిని సక్రమంగా వినియోగించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నట్లు పేర్కొంటున్నారు.

క్లోరింగ్ శాతం తెలుసుకునేందుకు..

గ్రామాల్లోని మంచినీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ కలిపారా.. లేదా.. దాని శాతం నీటిలో ఎంత ఉందో తెలుసుకునేందుకు క్లోరింగ్ పరీక్ష ఉపయోగపడుతుంది. వానాకాలంలో పైపులైన్ లీకేజీల కారణంగా నీటిలో బ్యాక్టీరియా చేరినా క్లోరింగ్ శాతం నీటిలో ఉన్నా అవి చనిపోతాయి. ఈ పరీక్షలను ఇళ్ల వద్దకు వచ్చే కుళాయిల దగ్గర శిక్షణ పొందిన సిబ్బందితో పాటు కార్యదర్శి కిట్ ద్వారా నీటిని పరీక్షిస్తే క్లోరింగ్ శాతం ఉందో.. లేదో.. తెలుతుంది.

సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

గ్రామపంచాయతీల్లోని తాగునీరు సరఫరా చేసే సిబ్బందికి నీటి పరీక్ష కిట్ల వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది గ్రామ పంచాయతీల్లోని సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. నీటి పరీక్ష కిట్లు అందజేస్తున్నారు. శిక్షణ ఇవ్వడం బాగానే ఉన్నా నీటి పరీక్ష కిట్లు వినియోగిస్తేనే ఫలితం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలోనూ కిట్లు పంపిణీ చేసినా ఎక్కడా నీటిని పరీక్షించిన దాఖలాలు లేవు. ఈసారి ప్రతీ బోరు నుంచి వచ్చే నీటితో పాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న భగీరథ నీటిని తరచూ పరీక్షించి తాగడానికి పనికి వస్తాయా.. లేదా? అనే విషయాలపై పంచాయతీలు స్పష్టత ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షల్లో నీటి నాణ్యత సరిగా లేకుంటే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి శుద్ధజలం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిబ్బందికి శిక్షణ ఇప్పించాం

నీటి పరీక్ష కిట్ల వాడకంపై ప్రతీ పంచాయతీలో ఒకరిని గుర్తించి శిక్షణ ఇప్పించాం. పైపులైన్ ద్వారా సరఫరా అవుతున్న నీరు స్వచ్ఛమైనదా.. కాదా.. తెలుసుకునేందుకు ప్రభుత్వం కిట్లు అందజేసింది. పైపులైన్ ఎక్కడైనా లీకేజీ అయితే బయటి నీరు పైపులైన్‌లోకి చేరుకుని తాగునీరు కలుషితమవుతుంది. ఇలాంటి నీటిని తాగితే అనారోగ్యం బారిన పడే అవకాశముది. ఈ పరీక్ష ద్వారా వెంటనే అప్రమత్తమై ట్యాంకులను శుభ్రం చేయడంతోపాటు క్లోరినేషన్ చేయవచ్చు.

– సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

చామన్‌పెల్లిలో వైద్యశిబిరం

సాక్షి స్పందన



గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో 20 రోజులుగా గ్రామస్తులు జ్వరాలతో బాధపడుతుండగా 'సాక్షి' 'చామన్‌పెల్లికి జ్వరమొచ్చింది' శీర్షికన ఆదివారం ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు వెంటనే స్పందించారు. 40 మంది గ్రామస్తులు డెంగీ బారిన పడి ఆస్పత్రుల్లో చేరిన విషయాన్ని తెలుసుకున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ప్రత్యూష సిబ్బందితో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. సమస్యను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నీటిని విడుదల చేయించాలి



శ్రీహరిరావుతో వివిధ గ్రామాల రైతులు

సోన్: యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు ఎండకుండా సరస్వతి కెనాల్‌కు సాగునీరు విడుదల చేయించాలని మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఆదివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. స్పందించిన శ్రీహరిరావు వెంటనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో ఫోన్‌లో మాట్లాడారు. సరస్వతి కెనాల్‌కు నీటిని విడుదల చేయించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు శ్రీహరిరావు తెలిపారు. త్వరలో అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీహరిరావును కలిసినవారిలో మాధాపూర్ మాజీ సర్పంచ్ రాజనర్సింహారెడ్డి, బర్మాదాస్, ఫక్రుద్దీన్, ముత్తన్న, రమేశ్‌రెడ్డి, అల్లూరి రాజు, వికాస్‌రెడ్డి వివిధ గ్రామాల రైతులున్నారు.

భక్తిశ్రద్ధలతో గన్‌గౌర్ వ్రతం



గౌరీదేవి విగ్రహ ఊరేగింపులో భక్తులు

భైంసాటౌన్: పట్టణంలో మార్వాడి మహిళలు గన్‌గౌర్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్నారు. ఏటా హోలీ మరుసటిరోజు శివపార్వతులను గన్‌గౌరీ రూపంలో ప్రతిష్ఠించి 16రోజులపాటు పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం పురాణాబజార్‌లో మహిళలు శివపార్వతుల విగ్రహాలను ఊరేగించారు. భక్తిపాటలు పాడారు. భజన చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అటవీప్రాంతంలో మంటలు



కాల్వ అటవీప్రాంతంలో కాలుతున్న చెట్ల ఆకులు

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ పరిసర అటవీప్రాంతంలో ఆదివారం మంటలు చెలరేగాయి. అటవీప్రాంతంలోని దారుల్లో వెళ్లేవారు సిగరెట్, బీడీ తాగి ఆర్పకుండానే పీకలు పడేస్తుండడంతో ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. అధికారులు ఈ విషయమై అవగాహన కల్పిస్తున్నా వారిలో మార్పు రావడంలేదు.

10నుంచి మక్కల కొనుగోలు కేంద్రాలు

భైంసాటౌన్: ఈనెల 10వ తేదీ నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా మక్కల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్వింటాల్‌కు రూ.3,180 మద్దతు ధర చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులకు మక్కలు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. నియోజకవర్గంలో 16వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసిన రైతుల ప్రయోజనం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర నుంచి మక్కలు తెచ్చి ఇక్కడ విక్రయించే అవకాశముందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ కమిషనర్



ఆలయంలో పూజలు చేస్తున్న కమిషనర్

భైంసా: బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారిని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరందు దర్శించుకున్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా బాసర ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలుకగా ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు తీర్థప్రసాదాలు అందించారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఎస్సై రాధిక

బేల: మండలంలోని శంకర్‌గూడ గ్రామ శివారులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో ఆదివారం తనిఖీలు చేస్తుండగా ఎటువంటి పత్రాలు లేని రూ.72,500 నగదును పట్టుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. మహారాష్ట్రలోని కొర్పణకు చెందిన రాథోడ్ కేశవ్ కారులో రూ.72,500నగదుకు ఎటువంటి పత్రాలు లేకుండా మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వైపునకు వస్తుండగా పట్టుబడినట్లు తెలిపా రు. ఆ నగదును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుభీర్: మండల కేంద్రం నుంచి మహారాష్ట్రకు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.85000 నగదును పట్టుకున్నట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు. యోగేశ్ వద్ద సరైన పత్రాలు లేని కారణంగా దొడర్నా చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ల పట్టివేత

సారంగపూర్: అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని అడెల్లి గ్రామ సమీపంలోని జలగల కుంట నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎస్సై చెరువు వద్దకు వెళ్లి ఐదు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. అనంతరం చర్యల నిమిత్తం తహసీల్దార్ శ్రీదేవికి సమాచారం అందజేశారు.

దాబాపై కేసు

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రా మ సమీపంలోని తీన్మార్ దాబాలో అక్రమంగా మద్యం విక్రయంతో పాటు అనుమతి లేకుండా సిట్టింగులు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం ఎస్సై చంద్రమోహన్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాబాలో పలువురు మద్యం సేవిస్తూ పట్టుబడగా తొమ్మిది బీరు బాటిళ్ల లభ్యం కావడంతో దాబా యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

కుభీర్: మండలంలోని సొనారి గ్రామంలో ఆదివారం బెల్ట్‌షాపుపై దాడిచేసి రూ.4100 విలువ గల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై పి.రవిందర్ తెలిపారు. మద్యాన్ని విక్రయిస్తున్న పూజేకర్ పండరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు

ఎదులాపురం: బ్యాట్‌తో కొట్టిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదైనట్లు ఏఎస్సై ముకుందరావు తెలిపారు. పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన వాసం వంశీకృష్ణ అదే కాలనీలోని పాఠశాలలో స్నేహితులతో క్రికెట్ ఆడుతున్నాడు. బంతి అదే కాలనీకి చెందిన ముజాఫిల్‌కు తగలడంతో అతను బ్యాట్, బాల్ లాక్కుంటాడు. దీంతో తిరిగి ఇవ్వాలని వంశీ అడగగా ముజాఫిల్ బ్యాట్‌తో కొట్టాడు. దీంతో వంశీ తల్లి ఫిర్యాదు చేసింది.

స్వయం ఉపాధి దిశగా..

ఉట్నూర్‌రూరల్: సమాజం మారింది.. మనం మారాలి.. అప్పుడే పురోగతి సాధించగలుగుతాం. అప్పుడే కుటుంబానికి ఆసరాగా నిలబడగలం.. అప్పుడే సమాజానికి ఆదర్శంగా నిలువగలం అంటున్నారు మారుమూల ప్రాంతాల యువత.. నేటి తరంలో బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్క్‌లో శిక్షణ పొందాలని గిరిజన యువతులు, మహిళలు ముందుకు వచ్చి ఆర్‌సెటి వేదిక ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతూ భవిష్యత్ తరాలకు బాటలు వేసుకుంటున్నారు.. మగ్గం వర్క్, బ్యూటీషియన్, టైలరింగ్ ఎస్‌బీఐ ఆర్‌సెటి అందిస్తున్న శిక్షణలపై ప్రత్యేక కథనం.

- ఆర్‌సెటి శిక్షణలో యువతులు, మహిళలు
- ఉచిత శిక్షణతో పాటు వసతి
- సద్వినియోగం చేసుకుంటున్న ఉమ్మడి జిల్లా యువత
- ఇప్పటి వరకు 9102 మందికి శిక్షణ



ఆర్‌సెటిలో శిక్షణ అనంతరం ఇంటివద్ద ఉపాధి పొందుతున్న యువతులు

అందిస్తున్న శిక్షణలు

యువతులతో పాటు ఇటు నిరుద్యోగ యువకులకు కూడా టూవీల్లర్ మెకానిక్, హౌజ్‌వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫ్రిజ్, ఏసీ, ప్లంబింగ్, శానిటరీ, క్యాంటర్ హార్డ్‌వేర్, నెట్‌వర్క్, ట్యాలీ, అకౌంటింగ్, సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, మోటార్ వైండింగ్ తదితర శిక్షణలు అందిస్తున్నారు.

ఎస్‌బీఐ–ఆర్‌సెటి ద్వారా శిక్షణ..

యువతకు ఇస్తున్న శిక్షణ మేలైన ఫలితాలు ఇస్తోంది. 2007లో ఉట్నూర్‌లోని కుమురంభీం కాంప్లెక్స్ ప్రాంగణంలో స్థాపించిన సంస్థ ప్రారంభం నుంచి ఇప్పటికీ 311 శిక్షణ శిబిరాలు నిర్వహించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 9102 మందికి శిక్షణ ఇచ్చింది. వీరిలో 7566 మంది ఉపాధి అవకాశాలు పొందారు. 3217 మందికి బ్యాంకు రుణాలు ఇచ్చింది. 6524 మందికి స్వయం ఉపాధి పొందగా.. 3307 మంది స్వయం ప్రాజెక్టులు ప్రారంభించారు. ఇతర కంపెనీలో 1042 మంది ఉద్యోగాలు పొందారు. అలాగే 2023–24లోనూ 23 శిక్షణ శిబిరాల ద్వారా 697 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యం పూర్తిచేశారు.

శిక్షణలో సౌకర్యాలు, ప్రత్యేక శిక్షణలు

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం జిల్లాల 10వ తరగతి వరకు చదివి ఉత్తీర్ణులైన లేదా అనుత్తీర్ణులైన యువతను శిక్షణ కోర్సుల్లో ప్రవేశం కోసం ఎంపిక చేస్తారు. అభ్యర్థులు 18 నుండి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారై ఉండాలి. శిక్షణ పొందే వారికి ఉచిత భోజనం, ఉదయం అ ల్పాహారం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. స్థాని క అభ్యర్థులైతే మధ్యాహ్నం భోజనం ఉంటుంది. శిక్షణ అనంతరం బ్యాంక్ నుండి రుణం పొందేందుకు అవసరమైన సలహాలు అందిస్తారు.





మగ్గం వర్క్, టైలరింగ్ నేర్చుకుంటున్న యువతులు

ఉపాధి అవకాశం ఎక్కువ



ప్రస్తుత రోజుల్లో బ్యూటీషియన్ వర్క్‌కు డిమాండ్ ఎక్కువ. ఈ శిక్షణను ఆర్‌సెటి సంస్థ ఉచితంగా అందరికీ నేర్పించడం చాలా సంతోషమైన విషయం, శిక్షణ కాలంలో ఫేషర్, మెహేంది డిజైన్, తదితర బ్యూటీపార్లకు సంబంధించి శిక్షణలు, అవగాహన కల్పించాం.. పిల్లలు సైతం చాలా బాగా నేర్చుకుంటున్నారు.

– రజిత, బ్యూటీషియన్ శిక్షకురాలు

ఇక్కడే నేర్చుకొని ఇక్కడే ట్రైనర్‌గా..



2017 బ్యాచ్‌లో ఇక్కడే కుట్టు మిషన్ శిక్షణ తీసుకున్నాను. నాకున్న నైపుణ్యతను గుర్తించి అధికారులు హైదరాబాద్‌లో పరీక్ష అనంతరం సంస్థలో ట్రైనర్‌గా ఎంపిక చేసుకున్నారు. కుట్టు మిషన్ నేర్చుకోవటం వలన స్వయం ఉపాధి పొందటానికి మంచి అవకాశం. దీంతో ఇతరులకు ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంది.

– మాహెద, కుట్టుమిషన్ శిక్షకురాలు

ఉపాధి కల్పనే లక్ష్యం



ఉపాధి కల్పనే లక్ష్యంగా యువతి యువకులకు శిక్షణ ఇస్తున్నాం. మా సంస్థలో అభ్యర్థుల ఇష్టం మేరకే కోర్సును నేర్చుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల వారికి శిక్షణ ఇస్తున్నాం. ఇదే శిక్షణ ప్రైవేటు సంస్థల్లో తీసుకోవాలంటే దాదాపు 20 నుంచి 30వేల రూపాయలు అవుతాయి. మేము వసతి, భోజనం, ఉచితంగా అందిస్తున్నాం.

– కె. లక్ష్మణ్, ఎస్‌బీఐ ఆర్‌సెటి డైరెక్టర్, ఉట్నూర్

నమ్మకం పెరిగింది..



నేను మగ్గం వర్క్ నేర్చుకోవడానికి ఇక్కడికి వచ్చాను. మగ్గం వర్క్ (వస్త్ర చిత్ర కళ ఉద్యామి) నేర్చుకోవడం వలన భవిష్యత్‌లో స్వయం ఉపాధి పొందుతాననే నమ్మకం పెరిగింది.. అన్ని వసతులతో ఇలా శిక్షణ అందించడం బాగుంది.. నా తోటి వారికి సైతం సలహాలు అందిస్తా.

– సౌజన్య, మగ్గంవర్క్, మంచిర్యాల జిల్లా, కవ్వాల్

చాలాబాగా నేర్పిస్తున్నారు..



తోటి స్నేహితుల ద్వారా ఇక్కడ శిక్షణ పొందవచ్చని తెలుసుకున్నాను. మగ్గం వర్క్‌తో పాటు అనేక రకాలుగా ఇక్కడ సులువైన పద్ధతిలో శిక్షణలు అందిస్తున్నారు. నేటి తరానికి ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడుతాయి. చేతి వృత్తులకు మార్కెట్‌లో డిమాండ్ బాగుంది.

– నిరోషన్, మగ్గం వర్క్, కుమురంభీం జిల్లా

భవిష్యత్తులో రాణిస్తా..



టైలరింగ్ కోసం ఇక్కడికి వచ్చాను. నేటి పోటీ ప్రపంచంలో స్వయం ఉపాధి సైతం ఎంతో అవసరం. అన్ని విద్యలు నేర్చుకొని ఉంటే సమాజంలో నిలదొక్కుకుంటాం. భవిష్యత్‌లో ఖచ్చితంగా షాపు వేసుకొని నడిపిస్తాను. టైలరింగ్‌పై అవగాహన వచ్చింది.. నెల రోజుల్లో నేర్చుకుంటానని అనుకోలేదు.

– శిరీష, మంచిర్యాల జిల్లా

ఆత్మ విశ్వాసం పెరిగింది



శిక్షణ కంటే ముందు ఇంటి దగ్గర ఖాళీగానే ఉండేదానిని. ఇప్పుడు ఈ శిక్షణ తీసుకోవడంతో స్వయం ఉపాధి పొందగలును అనే నమ్మకం, ఆత్మ విశ్వాసం పెరిగింది. నేర్చుకున్న మెలుకువలు కుటుంబ సభ్యులతో పాటు తోటి వారికి నేర్పించి ఉపాధి రంగంలో రాణించేందుకు కృషి చేస్తా..

– మహేశ్వరి, కుమురంభీ జిల్లా

'అడెల్లి'లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ నాయకులు

సారంగపూర్: ఆదిలాబాద్ శాసనసభ సభ్యుడు పాయల్ శంకర్ ఆదివారం మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు నిర్మల్ బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, నాయకులు వెంకటేష్, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. బాలాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయనను బీజేపీ శ్రేణులు ఘనంగా శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ నిర్మాణ శైలిని పరిశీలించిన ఇక్కడకు వచ్చే భక్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

రామారావ్ చూపిన మార్గంలో నడవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

జన్నారం(ఖానాపూర్): యువత సంత్ శ్రీ రామారావ్ మహారాజ్ చూపిన మార్గంలో నడుచుకోవాలని దీక్ష గురువు సంత్ ప్రేంసింగ్ మహారాజ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం జన్నారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీ సంత్ రామారావ్ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జువ్విగూడలో సేవాలాల్ మహారాజ్ ఆలయం ఎదుట పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి యువత చెడు మార్గం వైపు అడుగులు వేయకుండా సన్మార్గంలో నడవాలన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్, బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సుగుణ, ఆసిఫాబాద్ ఇన్‌చార్జి శ్యాంనాయక్, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ సరోజన, విగ్రహ కమిటీ సభ్యులు సందేశ్, ప్రకాశ్‌నాయక్, రాములు, భీంలాల్‌నాయక్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇరువురు మృతి

ఎదులాపురం: వేర్వేరు ప్రమాదాల్లో గాయపడిన ఇరువురు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని బోరికి చెందిన యాదవ్ మన్నే (33) మేస్త్రి పని నిమిత్తం శుక్రవారం మహారాష్ట్రలోని తివల్‌డోల్‌కి వెళ్లాడు. సాయంత్రం బోరికి చెందిన గుర్నూలే మోహన్ బైక్‌పై తిరిగి వెళ్తుండగా ఓ వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో యాదవ్ మన్నేకు, మోహన్‌కు గాయాలయ్యాయి. యాదవ్ మన్నేను చికిత్స నిమిత్తం శనివారం ఆదిలాబా ద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మోహన్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు.

హార్వెస్టర్ ఢీకొని

మహారాష్ట్రలోని శనివార్‌పేట్‌కు చెందిన రాథోడ్ సచిన్ (20) శనివారం కూలీ పనుల నిమిత్తం బోథ్ మండలం కౌట(బి)కి బైక్ పై వచ్చి, వర్క్ ముగించుకుని శనివార్‌పేట్‌కు తిరుగు ప్రయాణం అయ్యాడు. మహారాష్ట్రలోని బోదిడి పెట్రోల్ పంపు ప్రాంతంలో ఎదురుగా వస్తున్న ఓ హార్వెస్టర్ సచిన్ బైక్‌ను ఢీకొనగా కింద పడిపోయాడు. ఈ క్రమంలో సచిన్ పై నుంచి హార్వెస్టర్ వెళ్లగా సచిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా అదే రోజు రాత్రి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని క్రిటికల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం సచిన్ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా... ఒకరి మృతి

జైనథ్: మండలంలోని తరోడ-బి గ్రామ సమీపంలో ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... జైనథ్‌కు చెందిన జక్కుల్‌వార్ రికేష్ తన ఆటోలో ఆదిలాబాద్‌లో ప్రయాణికులను ఎక్కించుకొని శనివారం రాత్రి జైనథ్ వైపునకు బయలుదేరాడు. రాత్రి తరోడ-బి గ్రామ సమీపంలోకి రాగానే నిషేధిత వంతెన మీదుగా ఆటో ఎక్కించాడు. మద్యం మత్తులో ఉండటమే కాకుండా, నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో ఆటో ఒక్కసారిగా బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న జైనథ్‌కు చెందిన ఇప్ప భరత్ కుమార్ (38) తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న పుష్ప, పద్మ అనే మరో ఇద్దరు మహిళలకు గాయాలు కాగా, జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. ఈ మేరకు మృతుడి సోదరుడు ఇప్ప సుభాష్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ రికేష్‌ను అదుపులోకి తీసుకొని, ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు.

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

సారంగపూర్: మండలంలోని నిర్మల్-స్వర్ణ ప్రధాన రహదారిపై నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

పూరీలు వేసి.. ఓటు అభ్యర్థించి



హోటల్ వద్ద పూరీలు వేస్తున్న ఎంపీ అభ్యర్థి గోడం నగేష్

తాంసి: పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ఓటర్లను ఆకట్టుకునేందుకు వినూత్నంగా అభ్యర్థులు ప్రచారం చేపడుతున్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థి నగేష్ పార్టీ నాయకులతో ప్రచారం చేపట్టారు. ప్రచారంలో భాగంగా స్థానిక హోటల్ వద్ద స్వయంగా పూరీలు వేసి వినూత్నంగా ప్రచారం చేశారు. పూరీలు వేసి పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించాడు.

బీజేపీని గద్దెదించి దేశాన్ని రక్షించాలి



మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్ అధికారి మురళి

ఇంద్రవెల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించి దేశాన్ని రక్షించుకోవాలని మాజీ ఐఏఎస్ అధికారి అకునూరి మురళి అన్నారు. ఆదివారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆయా పార్టీల నాయకులతో కలిసి సమావేశమయ్యారు. ముందుగా దేశంతో పాటు రాష్ట్ర రాజకీయ పరిణామాలు, త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలపై, ఆయా పార్టీల విధానాలపై చర్చించి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలోని అన్ని కులాలకు చెందిన హక్కులతో పాటు మానవ హక్కులు, దేశాన్ని రక్షించుకోవాలన్నారు. కేంద్రంలో అధికారంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై చల్లుతున్న విషపూరిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, సోషల్ యాక్టివిటి కర్త నిర్మల, ఓయూ జర్నలిజం మాజీ ప్రొఫెసర్ పద్మజా షా, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన శేక్ ఇషా(45) ఇంట్లో శనివారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇషా కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో వాళ్లు చెప్పినా వినిపించుకోకుండా తప్పతాగి వచ్చేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఇషా ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయాన్నే గమనించిన కుటుంబీకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మృతుడి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడు..

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ గ్రామానికి చెందిన మేస్రం గోపాల్ (18) శనివారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గోపాల్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని నెలల నుంచి ఎలాంటి పని చేయకుండా తిరుగుతున్నాడు. ఇదే క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో మనస్తానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఒకరి మృతి



చిన్న పోశెట్టి(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని కోర్వగల్లికి చెందిన చిన్న పోశెట్టి(52) వడదెబ్బతో మృతిచెందాడు. స్థానికులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. చిన్న పోశెట్టి స్థానికంగా హమాలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొద్దిరోజులుగా పరిసర గ్రామాల్లో మక్కల తూకాలు వేస్తున్నాడు. శనివారం సైతం పనికి వెళ్లి సాయంత్రం నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా స్థానిక పంజేష చౌక్ సమీపంలో నీరసంతో కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

'ఇంద్రాదేవి'కి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఆదివాసీలు



నైవేద్యాలు తయారు చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో వివాహాలు నిర్వహించే పలు కుటుంబాలు సంప్రదాయం ప్రకారం నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పెళ్లి కార్యక్రమాలు షురూ చేశారు. మండలంలోని పొల్లుగూడ, తలమడుగు మండలం పల్లి(బి)తో పాటు ఉట్నూర్, నార్నూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు తరలివచ్చారు. ఆదివాసీ పెద్దలు ఆత్రం శంకర్, పెందోర్ మారుతి, దశరథ్, జుగాదిరావ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా 'ఆదర్శ' ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా కొనసాగాయి. పరీక్ష కేంద్రాన్ని డీఈవో రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 460 మంది విద్యార్థులకు గాను 120 మంది గైర్హాజరయ్యారు. 7,8,9,10 తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరిగింది. 578 మందికి గాను 138 విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు శ్రీనివాస్ ప్రసాద్, శ్రీకాంత్, డీవోలు ప్రవీణ్ కుమార్, రాజశేఖర్ తెలిపారు. ఎస్సై వి.రజనీకాంత్ ఆధ్వర్యంలో పరీక్షాకేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

దీక్షలు స్వీకరించిన గ్రామస్తులు



శ్రీరామదీక్షలు స్వీకరిస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన సుమారు 90 మంది శ్రీహరిమౌనస్వామి, సురేశ్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామదీక్షలు స్వీకరించారు. స్వాములంతా 9 రోజుల పాటు ఇంటి పనులు వదిలిపెట్టి ఆలయంలోనే నిద్రిస్తారు. ప్రతీరోజు వేకువజామున గ్రామంలో పారాయణం చేస్తారు. అనంతరం రామమందిరంలో వాల్మీకి రామాయణం, ఆధ్యాత్మిక రామాయణం, వేదపారాయణం నిర్వహిస్తారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద, వడ్యాల్ తండా గ్రామాల కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ తెలిపారు. లక్ష్మణచాంద గ్రామ అధ్యక్షుడిగా సుంకరి గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా అట్ల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా చిన్నయ్య, మహిపాల్, తోకల భీమేష్, కోశాధికారిగా ఓస శేఖర్, సంయుక్త కార్యదర్శిగా పృథ్వీరాజ్, కార్యవర్గ సభ్యులుగా పరమేశ్, భూమేష్, చిన్న పెద్దలు ఎన్నికయ్యారు. వడ్యాల్ తండా అధ్యక్షుడిగా తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రావు ఎన్నికయ్యారు. నాయకులు ఈటెల శ్రీనివాస్, గంగాధర్‌గౌడ్, రవి, శేఖర్‌రెడ్డి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గం



ఎన్నికైన అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండ రవి, ఉపాధ్యక్షుడిగా తలారి ప్రణయ్, కోశాధికారిగా రాచకొండ వినోద్, సంయుక్త కార్యదర్శిగా గోల శేఖర్, శాశ్వత సలహాదారుగా మెట్టు అమృతయ్య, ఎలుగు రాజలింగం ఎన్నికయ్యారు.

ఘనంగా మండలపూజ



పూజలు చేస్తున్న వేదపండితులు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ మహాదేవుని ఆలయంలో మండలపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విగ్రహాలు ప్రతిష్టించి నేటితో 41 రోజులపాటు పూర్తయిన సందర్భంగా వేద పండితుడు సంజీవ్ శర్మ ఆధ్వర్యంలో గణపతి, గౌరీ, దూపహారతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. దంపతులు ఈ పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇంపాక్ట్ స్ఫూర్తి అధ్యక్షుడిగా లక్ష్మణ్

భైంసాటౌన్: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ స్ఫూర్తి నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా భైంసాకి చెందిన వాడేకర్ లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సంస్థ ఫౌండర్ గంప నాగేశ్వర్‌రావు, డైరెక్టర్ శ్యాంరాథోడ్ ఆన్‌లైన్ ద్వారా నియామక పత్రాలు అందించారు.

కూల్.. కూల్‌గా..



వివిధ రకాల కూలర్లు

- మార్కెట్‌లో జోరుగా కూలర్ల విక్రయాలు
- కొనుగోలుకు జనం ఆసక్తి

భైంసాటౌన్: ఎండలు మండుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు నిప్పులు కక్కుతున్నాడు. మిట్టమధ్యాహ్నం కాకముందే సూరీడు నడినెత్తిపైకి చేరుకుంటున్నాడు. దీంతో ప్రజలు బయటికి రావాలంటే జంకుతున్నారు. అయితే, ఇంట్లో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాత్రివేళల్లో ఇళ్లలో భరించలేని ఉక్కపోతతో నిద్రపట్టని పరిస్థితి ఉంటోంది. దీంతో ఇంటిని చల్లగా ఉంచుకునేందుకు కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. కాస్త స్థితిమంతులు ఏసీలు కొనుగోలు చేస్తుండగా, సామాన్య, మధ్య తరగతికి అందుబాటులో ఉండే కూలర్లకే గిరాకీ ఎక్కువగా ఉంటోంది. ఫలితంగా మార్కెట్లో కూలర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రూ.వెయ్యి మొదలు రూ.15వేల వరకు వివిధ రకాల కూలర్లు అందుబాటులో ఉంటున్నాయి.

మినీ కూలర్లకు డిమాండ్

సమ్మర్ సీజన్‌లో మినీ కూలర్లకు ఎక్కువగా గిరాకీ ఉంటోంది. వ్యాపారులు ఎక్కువగా తమ తమ దుకాణాల్లోనే అధిక సమయం వెచ్చిస్తుంటారు. ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం మినీ కూలర్లను ఆశ్రయిస్తున్నారు. టేబుల్‌పై పోర్టబుల్ సైజ్‌లో ఉండే మినీ కూలర్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిలో ఐరన్, ఫైబర్ రకాలు అందుబాటులో ఉంటున్నాయి. రూ.1800 నుంచి రూ.5వేల వరకు వివిధ బ్రాండ్లు బట్టి ధరలు ఉంటున్నాయి. ఇక పెద్ద సైజ్ కూలర్లు, జంబో కూలర్లు రూ.10 వేలకు మించి లభిస్తున్నాయి.

ఉక్కపోతతో ఉండలేని పరిస్థితి

ఎండలు విపరీతంగా ఉంటున్నాయి. బయట పనిచేసి ఇంటికి వెళ్లి ఉపశమనం పొందుదామన్నా ఉక్కపోతతో ఉండలేని పరిస్థితి. రాత్రివేళల్లో కూడా ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది. వేసవికాలం రెండు, మూడు నెలలే అయినా కూలర్ తప్పనిసరిగా మారింది. అందుకే కొత్త కూలర్ కొనుగోలు చేశాను.

– రాహుల్, భైంసా

గిరాకీ బాగుంది

వేసవికాలంలో కూలర్లకు డిమాండ్ పెరుగుతుంది. మార్చి మొదటి వారంలో ఈసారి ఎండలు విపరీతంగా దంచికొడుతున్నాయి. ఉక్కపోతతో జనాలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం కూలర్లను ఆశ్రయిస్తున్నారు. రోజుకు ఐదు నుంచి పది వరకు కూలర్లు విక్రయిస్తున్నాం.

– మహేశ్, కూలర్ల వ్యాపారి, భైంసా

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



భర్త వద్ద భార్య రాజమణి, కుమార్తెలు

- టీబీ వ్యాధితో మంచం పట్టిన భర్త
- భార్యపై కుటుంబపోషణ భారం
- ఆదుకోవాలని వేడుకోలు



మంచం పట్టిన శ్రీనివాస్

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఎనగందుల శ్రీనివాస్ టీబీ వ్యాధి బారినపడ్డాడు. గత నాలుగేళ్లుగా ఇంట్లో మంచానికే పరిమితమయ్యాడు. ఇస్త్రీ బట్టలు చేస్తూ జీవనం సాగించే శ్రీనివాస్‌కు భార్య రాజమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వైపు అనారోగ్యంతో బాధపడుతున్న భర్త, మరోవైపు ఇద్దరు పిల్లల పోషణభారం భార్యపై పడింది. గత రెండేళ్ల క్రితం పెద్ద కుమార్తె శ్రీవాణి ఓ కన్నుకు గాయమై కోల్పోయింది. రూ.2లక్షలు అప్పు చేసి ఆమెకు కంటి చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. శ్రీనివాస్ గత నెలరోజులుగా పూర్తిగా బక్కచిక్కి పోయి అన్నపానీయాలు మానేశాడు. భార్య రాజమణి ఇంటి వద్దే బట్టలు ఇస్త్రీ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఇద్దరు కుమార్తెలు, భర్తను పోషించే స్తోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు వేడుకుంటున్నారు. ఫోన్ పే 9032363413 నెంబర్‌కు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

బోర్డులపై 'ఉపాధి' వివరాలేవి?

- కనిపించని పనులు, వివరాల సమాచారం
- పట్టించుకోని అధికారులు



హిప్నెల్లిలో నిరుపయోగంగా సమాచార బోర్డు

తానూరు: ప్రభుత్వం ఉపాధిహామీ పథకం సంబంధించిన సమాచారం, చేపట్టే పనులు, కూలీల వివరాలు తెలిసేలా ప్రతీ పంచాయతీలో సమాచార బోర్డులు నిర్మించింది. తానూరు మండలంలోని చాలా గ్రామాల్లో బోర్డులపై 'ఉపాధి'వివరాలు లేకుండా దర్శనమిస్తున్నాయి. శ్రమశక్తి సంఘాల్లోని కూలీల పేర్లు రాయకుండా వదిలేయడంతో బోర్డులు నిరుపయోగంగా మారాయి.

పనుల వివరాల నమోదులో నిర్లక్ష్యం

ప్రభుత్వం గతంలో ఆయా గ్రామాల్లో గోడలపై సమాచార బోర్డులు నిర్మించింది. జిల్లా సమాఖ్య నుంచి ఒక్కో బోర్డు కోసం రూ.11 వేలు వెచ్చించింది. గ్రామాల్లో గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో వీటిని నిర్మించారు. తానూరు మండలంలో అప్పటి 20 పంచాయతీలో 13 ఏళ్ల క్రితం నిర్మించిన బోర్డులపై పనుల వివరాలు నమోదు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఈ బోర్డులు ప్రైవేటు కంపెనీల ప్రచారానికి, ఇతరుల వాల్ పోస్టర్లు అతికించడానికి ఉపయోగపడుతున్నాయి. ఇదిలా ఉంటే, ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభమై వారం గడుస్తున్నా చేపట్టే పనుల వివరాలు నమోదు చేయడం లేదని పలువురు కూలీలు వాపోతున్నారు.

బోర్డులపై వివరాలు రాయాలి

నెలల వారీగా పూర్తయిన పనుల వివరాలు కూలీలకు అందించిన వేతనాల కూలీల పనిదినాలు, పూర్తయిన పనులకు ఖర్చయిన మొత్తం వివరాలు బోర్డులపై వారానికోసారి నమోదు చేయాలి. ఈ వివరాలు నమోదు చేయాలని 2011 నవంబర్‌లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. ఇప్పటివరకు సామాజిక తనిఖీ వివరాలు, కూలీల పేర్లు నమోదు చేయకుండా బోర్డులు నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా 'ఉపాధి'సంబంధించిన వివరాలు తెలియడం లేదని పలువురు కూలీలు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



కూలీలకు పూర్తి సమాచారం అందించేందుకు సమాచార బోర్డులు నిర్మించారు. ఉపాధి సంబంధించిన సమాచారం, వివరాలు తెలిసేలా రాయాలి. ఎలాంటి వివరాలు నమోదు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఉపాధి పనుల వివరాలు, ఇతరావి తెలిసేలా బోర్డులపై సమాచారం రాయించాలి. – సూర్యకాంత్, ఉపాధి కూలీ, ఉమ్రి(కే)

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో సమాచార బోర్డులపై ఉపాధి పనుల వివరాలను సిబ్బందితో రాయిస్తాం. గ్రామంలో చేపడుతున్న పనులు, కూలీల వివరాలు రాయించేలా చర్యలు తీసుకుంటాం.

– గంగాధర్, ఈజీఎస్ ఏపీవో



కుభీర్ స్టేజీ ప్రాంతంలో ఫ్యాన్లు లేని దృశ్యం



ఫ్యాన్ వేసుకుని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి..!



ప్రయాణికులతో కిక్కిరిసిన భైంసా బస్టాండ్

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. మహాలక్ష్మి పథకంతోపాటు పెళ్లిళ్ల, శుభకార్యాల సీజన్ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ నెలకొంటోంది. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. అయితే, బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసినా ఫ్యాన్లు పని చేస్తున్నా వాటిని ఆన్ చేయడం లేదు. మరోవైపు కంట్రోలర్ రూం వద్ద సిబ్బంది మాత్రం ఫ్యాన్ ఆన్ చేసుకుని విధులు నిర్వహిస్తున్నారు. అదే ప్రయాణికుల కోసం మాత్రం ఫ్యాన్లు నడపకపోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అలాగే కుభీర్ స్టేజీ ప్రాంతంలో ఫ్యాన్లు కనిపించడం లేదు. ఈ విషయమై డీఎం అమృతను ఫోన్‌లో సంప్రదించగా కొన్నింటిని మరమ్మతు కోసం పంపించామని, మిగతా స్టేజీల్లో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కంట్రోలర్ రూంలో స్విచ్‌లు ఉంటాయని, వాటిని ఆన్‌చేయాలని సిబ్బందికి సూచిస్తామని తెలిపారు.

అంత్యక్రియలకు తప్పని ఇక్కట్లు

ఖానాపూర్: పట్టణంలోని గోదావరికి అంత్యక్రియల నిమిత్తం వెళ్లే ప్రజలకు వారసంత కారణంగా ఇక్కట్లు పడుతున్నారు. అటు వ్యాపారులతో పాటు ఇటు అంత్యక్రియలకు వెళ్లే వారికి సైతం తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా వేసవి కావడంతో వారసంతకు గ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు మిర్చిని తీసుకువస్తారు. అంత్యక్రియలకు వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డుపై మిర్చి, ఇతర దుకాణాలు ఉండడంతో ఇరువురు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాప్ పునరుద్ధరణకు స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌లో గతంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్టాప్‌ను పునరుద్ధరణ కోసం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆర్టీసీ సిబ్బందితో కలిసి ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో బస్టాప్‌ను అధికారులు తొలగించారు. వారివెంట నాయకులు జన్నారపు శంకర్, నాయిని సంతోష్, పరిమి సురేష్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాలు ఆదివారం భక్తులతో సందడిగా మారాయి. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ఇస్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కేంద్ర పథకాలపై ఇంటింటా ప్రచారం



కరపత్రాలు, క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న రాంనాథ్

సారంగపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే చెత్తబుట్టలో వేసినట్లేనని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో లాబార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. వారి ఇళ్లకు వెళ్లి క్యాలెండర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు బీజేపీ పాలననే కోరుకుంటున్నారని అన్నారు. మూడోసారి మళ్లీ మోదీ ప్రధానిగా అవడం ఖాయమన్నారు. రాష్ట్ర నాయకుడు వెంకటేష్, మండల నాయకులు చాణక్య, చిన్నయ్య, బ్రహ్మయ్య, నవీన్, మహేంధర్, శ్రీను, రాకేష్, రాజేష్, తదితరులు ఉన్నారు.

మిత్రుడికి అండగా..



రాముకు ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యా సంవత్సరంలో తమతోపాటు చదువుకున్న మిత్రుడికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. విద్యానగర్‌కు చెందిన మిత్రుడు వడ్ల రాము భార్య లక్ష్మి ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. డాక్టర్ కృష్ణంరాజు, గణేశ్, అవ్వ బుచ్చన్న, గుగ్గిల్ల రాజేందర్‌గౌడ్, వెంకటప్పయ్య, శ్యామ్, శైలేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా భవనం



నర్సాపూర్(జి): మండల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.23 లక్షలతో నిర్మించిన ఎఫ్ఎస్ఓ క్వార్టర్స్ భవనం నిరుపయోగంగా మారింది. గతేడాది జూలైలో ఈ భవనాన్ని మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. నిర్మించి తొమ్మిది నెలలవుతున్నా ఎఫ్ఎస్ఓ (ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్) స్థానికంగా ఉండకుండా వేరే మండలం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో భవనం ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది.

పోచమ్మకు మొక్కు



పూజలు చేస్తున్న భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలోని పోచమ్మ ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. వివిధ గ్రామాల నుంచే కాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

భైంసా: బాసరలోని చింతామణి గణేశ్ ఆలయం వద్ద ఉన్న శివాలయంలో నంది, నాగేంద్రుడి విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు ఆనవాళ్లు చెరిపివేశారు. దీనికి బాధ్యులైన వారిని శిక్షించాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం ఎస్సై గణేశ్‌కు ఫిర్యాదు చేశారు.

సంక్షిప్తంగా

నేడు కాంగ్రెస్ సమావేశం

భైంసా: నిర్మల్‌లోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం కాంగ్రెస్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ బాసర మండల అధ్యక్షుడు మమ్మాయి రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి నాయకులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

'చలో హైదరాబాద్'కు తరలిన నాయకులు

నిర్మల్‌టౌన్: ఢిల్లీ సీఎం అరవింద్ క్రేజీవాల్ అరెస్టుకు నిరసనగా ఆదివారం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్, నాయకులు తరలివెళ్లారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భైంసా: బాసర మండలం కిర్గుల్(కె) గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆదివారంవరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు తదితరులు ఉన్నారు.

శిశుమందిర్ పాఠశాలకు విరాళం



విరాళం అందజేస్తున్న డాక్టర్ మహిపాల్

కుభీర్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాల అభివృద్ధికి భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ ఎం.మహిపాల్ రూ. 50 వేల విరాళాన్ని ప్రకటించారు. ప్రధానాచార్యులు హన్మండ్లుకు ఆదివారం ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. పాఠశాల అధ్యక్షుడు పి.లక్ష్మణ్, కార్యదర్శి పిరాజితోపాటు గోపాల కిషన్, పాఠశాల కమిటీ సభ్యుడు ఎస్.హృషికేష్ ఉన్నారు.